

# చండేరీ

## - యస్పీ చారి






*మగధీర సినిమాకి మాతృకగా వివాదాల్లోకి ఎక్కిన నవల.*

*రచయిత ప్రత్యేక అనుమతితో  పునర్ముద్రణ.*

*(గత సంచిక తరువాయి)*

### 8

**ప్రాజెక్టు వర్కు పేరిట ఐశ్వర్య, రూపమతి లిద్దరూ** బెంగుళూరుకు వెళతామంటే కాదనలేకపోయాడు భవానీ ప్రసాద్.

కూతురు కొన్నాళ్ళు తనకు దూరం కాబోతుందనేసరికల్లా అతని మనసు ఓ ప్రక్క పీకుతూనే ఉంది.

ఆ ఇద్దరి ప్రయాణానికీ కావాల్సిన ఏర్పాట్లన్నీ కూడా శ్రీతేజ చేతులమీదుగా చురుగ్గా సాగిపోయాయి.

అడక్కుండానే తనంతట తానుగా అన్ని పనులూ చేసిపెట్టిన అతడికెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో ఐశ్వర్యకూ తోచలేదు.

కానీ చివరి క్షణంలో అతని చేతినోసారి అందుకుని ఆప్యాయంగా తడిమి వదిలేసింది.

అంతమాత్రానికే ఆనందంతో మెలికలు తిరిగిపోయాడు శ్రీతేజ.

పిల్లలు వెళ్ళిపోయాక ఇల్లంతా చిన్నపోయినట్లుకాగా గతవారం రోజులన్నీ అతికష్టంగా వెళ్ళదీసింది హైమవతి.

కూతురు ఇల్లొదిలింది మొదలుకుని చాలా ఎక్కువ సమయాన్ని తన ఫామ్‌వర్కుకు వినియోగిస్తున్నాడు భవానీప్రసాద్. ఆ కారణంగా ఇంట్లో ఒంటరిగా ఉంటున్న హైమవతిని అంతులేని ఆలోచనలు చుట్టుముడుతున్నాయి.

తన కూతురు రూపమతికి తండ్రి రామ్‌సింగ్ కాదన్న విషయం తనకు తప్ప ఈ ప్రపంచంలో మరెవరికీ తెలీదు. ఆ పిల్లకు తండ్రి లేడన్న లోపాన్ని తెలియకుండా చేస్తూ వచ్చాడు భవానీ ప్రసాద్.

ఐశ్వర్యతో సమానంగా ఆ ఇంట్లో పెరుగుతున్న రూపమతికి ఆ కుటుంబానికీ, తమ తల్లిదండ్రులకు గల సంబంధం ఏమిటో ఈనాటికీ అర్థం కాని విషయంగానే మిగిలిపోయింది.

ఎప్పుడా ప్రసక్తిని లేవదీసినా అటు భవానీప్రసాదూ, ఇటు హైమవతి కూడా ఆ విషయాన్ని ఏదోరకంగా దాటవేసేవారు.

తన తండ్రి రామ్‌సింగ్ అనే ఓ విషయం తప్ప అతనెవరో ఎక్కడ ఉండేవాడో, ఏ ప్రాంతానికి చెందినవాడో, ఎలా చనిపోయాడో మొదలగు వివరాలేమీ రూపమతికి తెలియనీకుండా చేశారు.

కానీ ఆ రోజు అంటే ఇరవై ఏళ్ళ తర్వాత రూపమతికి తండ్రెవరో తను తెలుసుకోగలిగింది.

జియాజీరావు కంఠస్వరాన్ని ముందు గదిలోంచి ధ్వని తరంగాలు మోసుకురాగానే హైమవతి మస్తిష్కద్వారాలు చాలాసేపువరకూ మూసుకునే పోయాయి.

చేతనావస్థని కోల్పోయిన ఆమె శరీరం జియాజీరావు తమ ఇంట్లో నుంచి వెళ్ళిపోయిన అరగంట తర్వాతగానీ కుదుటపడలేదు.

తను చేయాల్సిన ప్రయాణం గురించీ, ఆ తర్వాత తను చేరుకోబోయే చండేరీ, ఓర్ఛాల గురించీ, ఖజురహో ఫంక్షన్ గురించీ తన పడకగదిలో బోర్లా పడుకుని తీరిగ్గా కలలు కంటోంది ఐశ్వర్య.

తను కనిపిస్తే చాలు అదోరకమైన మమకారం తొణికిస్తోన్న కళ్ళతో ఒళ్ళంతా ఒణికిపోతుండగా ప్రతిసారీ తనకు చేరువ కావాలని ప్రయత్నిస్తున్న జియాజీరావుని గురించి తీవ్రంగా ఆలోచిస్తూ హాల్లోని సోఫాలోకి జారిపోయింది రూపమతి.

ఎందుకలా జియాజీరావు తనని చూస్తున్నాడు?

అతని కళ్ళల్లో కోరిక కనిపించడంలేదు. మరేమిటది?

తనని చూడగానే అదోరకమైన వాత్సల్య ధోరణి అతనిలో వ్యక్తమవుతోంది. ఎందువల్ల?

అలా ఆ ఇంట్లో ఉన్న ముగ్గురాడవాళ్ళూ, ఒకళ్ళతో ఒకరికి సంబంధం లేనట్లుగా ఎవరి ఆలోచనలో వాళ్ళు మునిగితేలుతుండగా వీధిలో ఓ ఆటో హారన్ వినిపించింది. ఆ ఆటో వెనకాలే వచ్చి ఆగిన శ్రీ తేజ మోటార్ సైకిల్ హారన్ కూడా బొయ్‌మంది.

అది వింటూనే ఐశ్వర్య, రూపమతిలిద్దరూ వీధిలోకి పరిగెత్తారు.

ఆ మరునిముషంలోనే ఆ ఆటో కంట్రీ కాజిల్ క్లబ్‌లో ఉన్న జియాజీరావు మకాం వైపు పరుగుతీసింది.

●●●

ఆ సంఘటనకు పూర్వమే వంట ఇంట్లో పొంగిపోతున్న పాలవిషయంలోనూ, దాదాపు పాలిపోయిన తన శరీరం గురించి అటు ఐశ్వర్యా, ఇటు కూతురు రూపమతి కంగారుగా వేసిన ప్రశ్నలకు సమాధానం ఏం చెప్పాలో తోచక బిక్క మొహం వేసుకుని నిలబడిపోయింది హైమవతి.

"కొంచెం కళ్ళు తిరిగినట్లయ్యాయమ్మా" అంటూన్న హైమవతి వంక వింతగా చూశారా ఇద్దరూ.

అయితే ఆ క్షణంలో రూపమతి చూసిన చూపు ఇంకా హైమవతిలో బాకులా గుచ్చుకుంటూనే ఉంది.

తన వంక అనుమానంగా, అదోరకంగా చూస్తున్న కూతుర్ని ఐశ్వర్య గబగబా అక్కడ్నుంచి తీసుకువెళ్ళిపోయింది.

"పాలగిన్నె పైన పడుతుందనే భయంతో షాక్‌కి గురయినట్లుంది మీ అమ్మ. ఆమెని కొంచెం తేరుకోనీ పద!"

అయితే రూపమతి మాత్రం అక్కడ్నుంచి వెళుతూ కూడా ఏదో అనుమానంతోనే కదిలి వెళ్ళింది.

ఆ తర్వాత రెండు మూడురోజులూ కాలేజీ ప్రయాణం గురించిన హడావిడితోనే ఆ ఇద్దరాడపిల్లలకి సరిపోయింది.

"ఆయా! నేను ఖజురహోకి వెళుతున్న విషయాన్ని నాన్నగారికి ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియనివ్వనని నాకు మాటివ్వు" అంటున్న ఐశ్వర్య చేతిలో అప్రయత్నంగానే తన చేతినుంచింది హైమవతి.

ఆ క్షణంలో ఆమె ఆలోచనలన్నీ రేపు రూపమతి అక్కడికెళ్ళాక జియాజీరావుని కలిస్తే ఏమవుతుందోనన్న భయంతోనే నిండివున్నాయి.

బెంగుళూరుకు వెళ్ళేరోజు కూడా తల్లితో సరిగ్గా మాట్లాడలేదు రూపమతి.

రేపు ఖజురహోనుంచి తిరిగొచ్చాక కూతురు తననే విధంగా నిలదీస్తుందోనన్న అనుమానంతో కృంగిపోసాగింది హైమవతి.

రాగానే కూతురు వేసే మొదటిప్రశ్న ఏ రకంగా ఉంటుందోనన్న భీతితో ఆమె మొహం కూడా పాలిపోయింది. దాంతో ఆమెకి ముచ్చెమటలు ముంచుకొచ్చాయి.

చీరకొంగుతో నుదుటిని అద్దుకుంటూ ఓ క్షణం చటుక్కున ఆగిపొయి కుంకుమలేని తన నుదుటిని అద్దుకుంటూ ఓ క్షణం చటుక్కున ఆగిపోయి ఆ మరుక్షణమే బలంగా అదుముకుంది.

కుంకుమలేని తన నుదురు విషయం గుర్తుకురాగానే మళ్ళీ ఆమెకి రామ్‌సింగ్ చివరిదశ కళ్ళముందు మెదిలింది.

సరిగ్గా ఇరవైఏళ్ళ క్రితం..

ఆ రాత్రి,

హైమవతి జీవితం బురదలో కలసిపోయిన క్షణం.

అంతా ఆమె కళ్ళముందు కదలాడింది.

ఆ రాత్రి తెల్లవారాక డ్రైవర్ రామ్ సింగ్ ప్రాణాలతో మళ్ళీ ఆ ఇంటికి తిరిగిరాలేదు. సరిగ్గా నలబై రోజుల తర్వాత అతని శవం మాత్రమే ఆ వాటాకి తిరిగివచ్చింది.

తను శీలాన్ని కోల్పోయిన విషయాన్ని భర్తకు చెప్పుకోలేక అవమాన భారంతో కృంగిపోతూ అతనికెదురవడం ఆమె మానుకుంటే దాంపత్య జీవితంలో తన అసమర్ధతని వ్యక్తం చేసుకోలేని దుస్థితికి కుళ్ళిపోతూ భార్యకు మొహాన్ని చూపలేకపోయాడు రామ్‌సింగ్.

ఆ వర్షం కురిసిన రాత్రే అడవిలో వేలాది చెట్లు కూలిపోయాయి. ఆ కలపని స్మగ్లర్లపాలు కాకుండా చేయాల్సిన బాధ్యత తనపై ఉండడంతో తాత్కాలికంగా తన ఆఫీసుని అడవిలోని మాళవ కాజిల్ టవర్‌కి మార్చుకున్నాడు భవానీప్రసాద్.

బుందేల్ బావిపక్కనే ఉన్న ఆ వాచ్‌టవర్‌లో ఓ రాత్రి గడిపేయాలన్న కోరిక అతన్ని వెంటనే ఆక్రమించింది తన ప్రమేయం లేకుండానే తనక్కడో రాత్రి గడపాలనుకోవడం విచిత్రంగా తోచింది.

ఆ ఆలోచన రాగానే అన్నపూర్ణని కూడా అక్కడికి రప్పిస్తే బావుంటుందని మరో ఆలోచన కలిగింది.

భవానీ ప్రసాద్‌కు ఆ ఆలోచన కలగగానే జీపుని రిపేర్ చేసి తీసుకు వచ్చిన రామ్‌సింగ్ కనిపించాడు.

"వెళ్ళి మేడమ్‌ని తీసుకురా రామ్‌సింగ్!"

గతరాత్రి భార్య ద్వారా కలిగిన వ్యధ అధికమైపోయి తలంతా బరువుగా పోటెత్తిపోతున్నా కూడా తన పై అధికారి మాటని శిరసావహించాడు రామ్‌సింగ్.

ఓ గంట తర్వాత అన్నపూర్ణ మాళవ కాజిల్ టవర్‌ని చేరుకుంది. మళ్ళీ మెకానిక్ దగ్గరికి వెళ్ళొస్తానంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు రామ్ సింగ్.

అతను తిరిగొచ్చేసరికి ఆమె సిద్ధంగా ఉంది.

"పదండి మేడం! ఆలస్యం అవుతోంది" అంటూ అన్నపూర్ణని తొందరచేసాడు రామ్ సింగ్.

"ఉండు రామ్‌సింగ్. హైమవతి స్నానం చేస్తున్నట్లుంది. చెప్పి వెళదాం. ఓ నిముషం ఆగు" అంది అన్నపూర్ణ.

"నేనొచ్చి చెబుతాను. పదండి మేడం" అంటూ మళ్ళీ రామ్‌సింగ్ అనేసరికి ఇక అన్నపూర్ణకు తప్పలేదు.

వచ్చి జీపులో కూర్చుంటూ అతనివంక ఆశ్చర్యంగా చూసిందామె. వచ్చి కూడా భార్యకు కనబడకుండా పరిగెత్తుతున్నాడు.

అన్నపూర్ణ, రామ్‌సింగులు అడవికి చేరుకోగానే మళ్ళీ ఆకాశం దద్దరిల్లిపోయింది. ఉరుములూ, మెరుపులూ ప్రారంభమయ్యాయి.

వాళ్ళక్కడికి రాకముందే మరో జీపులో అడవిలోకి వెళ్ళిపోయాడు భవానీప్రసాద్.

భర్త ఆఫీస్ టేబుల్ మీద వున్న ఓ బైనాక్యులర్‌ని అందుకుని కిటికీ వైపు నడిచింది అన్నపూర్ణ. అక్కడ్నుంచి బుందేల్ బావి పరిసరాలు కనిపిస్తున్నాయి.

ఆ బావిదగ్గరే ఓ పెద్ద సంఖ్యలో లేళ్ళూ, దుప్పులు గుమికూడి ఉన్నాయి. వాటిని చూస్తూ నిలబడిపోయిందామె. రామ్‌సింగ్, అన్నపూర్ణల జీపు అలా వెళ్ళిందో లేదో స్నానం చేసి ఇవతలికి వచ్చింది హైమవతి.

"మేం వెళ్ళిపోతున్నాం. షూటింగ్‌కి కుదిరేట్టులేదు. వచ్చి ముందు తలుపువేసుకోండి" అంది అప్పుడే అక్కడికి వచ్చిన జియాజీరావు ఫిల్ముయూనిట్‌కి సంబంధించిన లేడీ ఆర్టిస్టు.

హైమవతి మౌనంగా ఉండిపోయింది.

ఆమె అలా చూస్తుండగానే ఆ ఫిల్ము యూనిట్ వాళ్ళంతా ఓర్ఛా ప్యాలెస్ ఆవరణను ఖాళీచేసి వెళ్ళిపోయారు.

ఒంటరిగా ఆ ఇంట్లో మిగిలిపోయింది హైమవతి.

ఆ రాత్రికూడా ఆమె ఒక్కత్తే ఒంటరిగా తన వాటాలో ఉండాల్సి వచ్చింది.

మాళవ కాజిల్ టవర్‌లో ఉన్న అన్నపూర్ణ దంపతులు అతన్ని వెనక్కి తిరిగి పంపినా కూడా తమ ఇంటికి తిరిగిరాలేదు రామ్‌సింగ్.

ఆనాటినుంచీ అడపాదడపా రావడం అయితే జరుగుతోందిగానీ తను అన్నపూర్ణ ఇంట్లో పనిలో ఉండగానే వచ్చి వెళ్ళసాగాడు రామ్‌సింగ్.

ఆ విషయాన్నామె బాగా గ్రహించి వేసింది. దాంతో ఆమె గుండె బరువెక్కడం ప్రారంభించాయి.

అన్నపూర్ణ ఓ రాత్రి అడవిలో గడిపి తెల్లారి తిరిగివచ్చాక ఆమెలో వచ్చిన మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తూ ఉండడంతో అదేమిటో హైమవతికి అర్థంకాక బుర్ర బద్దలుచేసుకుంది.

అలా తిరిగివచ్చిన అన్నపూర్ణ ఆ క్షణం నుంచే తను ఎన్నడూ కనీ వినీ ఎరుగని రీతిలో పూజాపునస్కారాలు ప్రారంభించింది.

ఆ కారణంగా హైమవతికి నిరంతరం ఆ సేవలోనే కాలం గడిచిపోసాగింది.

ఆ మధ్య కాలంలో కలపని టెండర్ల ద్వారా విక్రయింపజేస్తున్న భవానీప్రసాద్ చాలా రాత్రుల్ని మాళవ కాజిల్ టవర్‌లోనే గడపాల్సి వచ్చింది.

ఆ ఒక్కరోజు తరువాత అన్నపూర్ణ మళ్ళీ ఆ ప్రాంతానికి వెళ్ళదలచుకోలేదు.

రామ్‌సింగ్ అడపాదడపా హైమవతిని అన్నపూర్ణ ఇంట్లో ఉండగానే పలకరించడం అలవాటు చేసుకున్నాడు.

ఇంట్లోకి కావాల్సిన సరుకుల్ని గమనిస్తూ తెచ్చిపడేసి వెళ్ళిపోతుండడం కూడా చేసాడతను. తన మనసులోని అలజడిని అణుచుకోవడానికి కొంతవరకదే సబబుగా తోచిందతనికి.

హైమవతికి కూడా అది తాత్కాలిక ఉపశమనాన్ని కలిగిస్తూ వచ్చింది.

కానీ సరిగ్గా నలభైరోజుల తర్వాత బాంబు ప్రేలింది.

అతి విచిత్రంగా అటు అన్నపూర్ణా, ఇటు హైమవతి ఇద్దరూ కూడా ఒకరి వెనకాలే ఒకరు కళ్ళు తిరిగి పడిపోయారనీ, వాళ్ళిద్దర్నీ ఓర్ఛాలోని ఫారెస్టు గార్డులు కొత్తగా తెరిచిన గవర్నమెంటు హాస్పిటల్లో చేర్చారని వార్త తెలీగానే భవానీప్రసాద్, రామ్‌సింగ్‌లు పరుగెత్తుకొచ్చారు.

రాగానే హాస్పిటల్ సిబ్బంది ద్వారా వారికో శుభవార్త అందింది.

అన్నపూర్ణ గర్భవతి అయిందని తెలిసి ఆనందంతో పొంగిపోయాడు భవానీప్రసాద్.

హైమవతి కూడా గర్భవతి అని తెలిసి విషాదంతో కృంగిపోయాడు రామ్‌సింగ్.

ఆ రాత్రే ఆ విషయాన్ని భరించలేని రామ్ సింగ్ తప్పతాగాడు. మైకంతో నడిపిన జీపు వెళ్ళి అడవిలో ఓ చెట్టును గుద్దుకుంది. తలకు బలంగా తగిలిన గాయాలతో భార్య ఉన్న హాస్పిటల్‌కే చేరాడతను.

తన ఒడిలో మరణవేదనని అనుభవిస్తున్న భర్తను చూసి ఘొల్లుమంది హైమవతి.

భార్య అశ్రువులు మొహంపై పడగానే కళ్ళు తెరిచాడు రామ్‌సింగ్.

మొదటిసారిగా ఆమె కన్నీటిని తన చేతులతో ఆపే ప్రయత్నాన్ని చేసాడతను. ఆ సందర్భంగా భర్త అన్న మాటల్ని హైమవతి ఎలా మరచిపోతుంది?

"హైమా! నీకు నేను భర్తగా న్యాయం చేయలేదు. చేయగలిగే శక్తి భగవంతుడు నాకు నాకు ప్రసాదించలేదు అందుకు నేను చింతించని క్షణం లేదు. నీకు జరిగిన అన్యాయానికి బాధ్యుడ్ని నేనే. నా గురించి నీకే మాత్రం తెలిసినా నీ జాగ్రత్తలో నీవు ఉండేదానివి. శీలాన్ని పోగొట్టుకున్న స్త్రీ బాధని ఆ భగవంతుడు కూడా తీర్చలేడు. కానీ పండనున్న నీ కడుపు నా ఆత్మని ఓ రకంగా శాంతింపజేస్తుంది. రామ్‌సింగ్ నపుంసకుడని లోకానికి తెలీకముందే నాకు పిలుపు వస్తోంది.

నీ కడుపులో నాకు బదులుగా మరొకరి శిశువు జీవం పోసుకుందన్న విషయాన్ని నాలోని మగతనంలేని మనిషి భరిచడంలేడు హైమా! ఈ అసమర్ధుడిలోని అహంకారాన్ని చంపుకోలేక నన్ను నేను చంపుకునేందుకు సాహసించాను. అందుకు నన్ను మన్నించు. బ్రతికి ఉండి ఎలాగూ నిన్ను ఏలుకునే శక్తి నాకు లేదు. అందువల్ల నేను బ్రతకడంలో అర్ధంలేదు.

మానసికంగా యమయాతనని అనుభవిస్తూ ఈ దౌర్భాగ్యపు శరీరాన్నిమోస్తూ తిరగలేను. కానీ చివరిసారిగా నిన్నో కోరికని కోరుతున్నాను. నా అనంతరం నీ కడుపులో పెరుగుతున్న శిశువుని మాత్రం అంతం చేయవద్దు ఆ ప్రాణికి కూడా నా పరంగా అన్యాయం జరిగినట్టవుతుంది" అంటూ భార్య చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు రామ్‌సింగ్

ఆ మరుక్షణమే అతని చేయి ఆమె ఒళ్ళోంచి నిర్జీవంగా జారిపోయింది.

అల్లుడి మరణవార్తని వింటూనే చండేరీ గెస్ట్ హౌస్ లోని ఉమ్రావ్‌సింగ్ ప్రాణాలు కూడా హఠాత్తుగా గాలిలో తేలిపోయాయి.

అటు భర్తా, ఇటు తండ్రీ ఒకేసారిగా చనిపోవడంతో ఈ లోకంలో ఏకాకిగా మిగిలిపోయిన హైమవతికి ఆశ్రమం ఇవ్వాలని నిర్ణయించిన అన్నపూర్ణతో ఏకీభవించాడు భవానీప్రసాద్. ఇన్నాళ్ళూ ఆ కుటుంబం నీడలో తలదాచుకుంటున్న తన బ్రతుకులోనూ, తన కూతురు బ్రతుకులోనూ చిచ్చు మళ్ళీ రగలనుందా?

అసలు జియాజీరావు ఈ హైదరాబాదు దాకా ఎందుకు వచ్చినట్టు?

రూపమతితో తనకు గల రక్తసంబంధమే అతన్నిక్కడికి లాక్కుని వచ్చిందా లేక రూపమతిని అతను శారీరకంగా..?

ఆ ఊహ మనసులోకి రాగానే కెవ్వుమంది హైమవతి.

"ఏమయింది హైమా?" అంటూ అప్పుడే లోనికి వస్తున్నాడు భవానీప్రసాద్.

●●●

భవానీప్రసాద్ లోనికి రావడం చూస్తూనే దిగ్గునలేచింది హైమవతి.

అతని వెనకాలే ఏదో వెతుకుతున్నవాడిలా ఇంట్లోకి వచ్చాడో వ్యక్తి.

వేళ్ళాడేలా వెనక్కి దువ్విన పొడువాటి జుట్టు, మొహం కనిపించకుండా గెడ్డం మీసాలూ, ఒంటిపైన ఏ మాత్రం శ్రద్ధ లేనట్టుగా కనిపిస్తున్న ఆ వాలకాన్ని చూసి పొరపాటున తమ ఇంట్లోకి వస్తున్నాడనుకుందామె.

కానీ భవానీప్రసాద్ ఆ వ్యక్తిని సాదరంగా ఆహ్వానిస్తూ తీసుకెళ్ళి సోఫాలోకి చేర్చడం చూసి నాలుక్కరుచుకుంది.

"కూచోరా రాచిపా! ఓ క్షణంలో వస్తాను" అంటూ తన గదివంక వెళ్ళబోయినవాడల్లా హైమవతిని చుసి ఆమె దగ్గరకు వచ్చాడు భవానీ ప్రసాద్.

"ఏమిటలా ఉన్నావు హైమా? ఏం జరిగింది?" కంగారుగా ప్రశ్నిస్తున్న భవానీప్రసాద్ కేం సమాధానం చెప్పాలో ఆమెకి తోచలేదు.

ఈలోగా ఆ కొత్త వ్యక్తి తన అరకళ్ళద్దాల్లోంచి హైమవతి వంక అదోలా చూశాడు. ఈమె ఎవరు అన్నట్టుందా చూపు.

ఆ చూపుని భరించలేక వెంటనే వంట ఇంట్లోకి తప్పుకుంది హైమవతి. ఆమె వెనకాలే తానుకూడా వంటగదిలోకి వచ్చేశాడు భవానీప్రసాద్.

పాలిపోయి ఉన్న ఆమె మొహమూ, ఒణికిపోతున్న ఆమె ఒళ్ళూ బాహాటంగా కనిపిస్తున్నాయి.

"ఏం జరిగింది హైమా?" మళ్ళీ ప్రశ్నించాడతను.

"ఏం లేదండీ చాలా రోజుల తర్వాత ఒంటరిగా ఉండటం వల్ల గతం గుర్తుకొచ్చింది" అంటూ ఆమె ఇంకా ఏదో చెప్పబోయింది.

కానీ గిర్రున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు భవానీప్రసాద్.

అతనలా అంతర్ధానం అవడం హైమవతిని ఏమాత్రం కలవరపెట్టలేదు.

చండేరీ, ఓర్ఛాల గురించిన వివరాల్ని ఎత్తినప్పుడల్లా అతనాప్రదేశం నుంచి తప్పుకోవడం ఆమెకో అలవాటుగా మారిపోయింది.

గోడపై వేళ్ళాడుతున్న ఐశ్వర్య ఫోటోవంక చూస్తున్న మిత్రుడి మొహంలో వస్తున్న మార్పుల్ని దూరంనుంచే గమనించాడు భవానీప్రసాద్.

"మైగాడ్! ఈ అమ్మాయి ఫొటో ఇక్కడెందుకుంది?" అంటూ ముక్కున వేలేసుకుంటున్న అతనివంక వింతగా చూశాడతను.

"ఇక్కడ కాకపోతే మరెక్కడుండాలంటావు? ఇది ఆ పిల్ల ఇల్లు, అది నా కూతురు ఐశ్వర్య."

అది వింటూనే మెరుస్తూన్న కళ్ళతో భవానీప్రసాద్ వంక చూశాడా వ్యక్తి.

"ఓ మైగాడ్ ఇందాక బెంగుళూరు నుంచి వస్తూండగా ఆకాశంలో దారితప్పిన ఏ దేవకన్యో పొరపాటున మా విమానంలో అవతరించిందనుకున్నాను. ఆ అమ్మాయి ఫ్లయిట్‌లోకి వచ్చింది మొదలుకుని ప్యాసింజర్లంతా ఆడామగా తేడాలేకుండా ఆమెనే గమనిస్తూ కుర్చున్నారు. ఆమె అందం అందర్నీ కట్టిపడేసింది. అంతటి అందాలరాశి నీ కూతురయినందుకు నిన్ను మనసారా అభినందిస్తున్నానురా ప్రసాద్. నాకే ఓ కొడుకు ఉండివుంటే బలవంతాన్నయినా అమ్మాయిని మ ఇంటికోడల్ని చేసుకునేవాడిని. కానీ నా అదృష్టంలేదుగా? ప్చ్? అంటూ పెదవి విరుస్తున్న మిత్రుడి వంక అయోమయంగా చూస్తూ "ఏంట్రా గోల? సరిగ్గా చెప్పి ఏడువ్" అంటూ విసుక్కున్నాడు భవానీప్రసాద్.

అది విని కొంచెం వెనక్కి తగ్గాడా వ్యక్తి.

"ఎందుకలా విరుచుకుపడతావ్?" ఆ అమ్మాయి నా వెంటే ఢిల్లీ టిక్కెట్‌తో బెంగుళూరులో ఫ్లయిట్ ఎక్కింది. నేను హైదరాబాదులో దిగి పోయాను. తాను నేరుగా వెళ్ళిపోయింది. అయితే అమ్మాయి ఢిల్లీ ప్రయాణం గురించి నీకు తెలీదా?"

"ఎవరూ, మా ఐశ్వర్యా? ఢిల్లీ వెళ్ళిందా?" ఆశ్చర్యంతో కళ్ళు తేలేశాడు భవానీప్రసాద్.

అది చూసి ఆ వ్యక్తికేం చేయాలో తోచక చేతులు నలుపుకుంటూ వెళ్ళి సోఫాలో చేరగిలబడిపోయాడు.

"ఒరేయ్ రాచిప్పా! కంగారు పెట్టి చంపకురా. ఎవర్నో చూసి మా అమ్మాయనుకుంటున్నావు కదూ?" అంటూ వెళ్ళి ఆ వ్యక్తి పక్కనే కూచుని ఆశగా చూశాడు భవానీప్రసాద్.

"నేను చెప్పింది అబద్ధం అనుకుంటే నేను చేయగలిగిందేమీ లేదు. ఈ ఫోటోలోని పిల్ల, ఆ విమానంలో ఢిల్లీ వెళ్ళిన అమ్మాయి ఒక్కటేనని ఘంటాపథంగా చెబుతున్నాను. ఇకపైన నీ ఇష్టం" అంటూ తేల్చేశాడావ్యక్తి.

అది వింటూనే నీరుగారిపోయాడు భవానీప్రసాద్.

"అమ్మాయి గత వారం రోజుల్నుంచీ బెంగుళూరులోనే ఉందిరా, కానీ దాని ఈ ఢిల్లీ ప్రయాణం గురించే నాకేమీ అంతుపట్టడంలేదు అలా వెడతానని నాకు చెప్పివెళ్ళలేదు. అంతా నమ్మశక్యం కాకుండా అయోమయంగా ఉంది" గొణుక్కున్నాడు భవానీప్రసాద్.

"ఒరేయ్ ప్రసాద్ రాతిగీతల్లో చరిత్రని చదివేవాడ్ని. బొమ్మల్ని చూసి భావాల్ని వ్రాసేవాడ్ని, అందువల్ల నా కళ్ళే నన్నంతగా మోసం చేసుంటాయంటే మాత్రం నేను భరించలేనురా ఐశ్వర్య మరో అమ్మాయితో కలిసి విమానం ఎక్కిన క్షణం నుంచే నా కళ్ళు కదలికని మానుకున్నాయి. హైదరాబాదు చేరేదాకా నా దృష్టిని మరోవైపు మళ్ళించలేక పోయానని సిగ్గువిడిచి చెపుతున్నాను. అది చాలా?"

అది వింటూనే ఉలిక్కిపడ్డాడు భవానీప్రసాద్.

"అంటే రూపకూడా ఐశ్వర్యవెంట ఉందా?" ఈసారి మరింత ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని ప్రక్కనే ఉన్న సోఫాలోకి జారిపోయాడతను.

రాయసం చిన పాండురంగం లేదా రాచిపా అనబడే నిక్ నేమ్ గల ఆ వ్యక్తి భవానీప్రసాద్ మొహం హఠాత్తుగా పాలిపోవడం చూసి కంగారుగా లేచి నుంచున్నాడు.

"ఏంరా ప్రసాద్? ఏం అవుతోంది? అంతగా ఆందోళన పడుతున్నావేం?" ఆదుర్దాగా ప్రశ్నించాడు.

రాచిపా ప్రశ్నకి వెంటనే సమాధానం చెప్పలేదు భవానీప్రసాద్.

"నీవింతగా ఖచ్చితంగా చెబుతుంటే నమ్మక తప్పదురా. ఐశ్వర్య ఢిల్లీకి ఎందుకు వెడుతుందో నాకు తెలీదు. ఉండు, లోనికెళ్ళి ఓ క్షణంలో తిరిగివస్తాను" అంటూ గబగబా వంటింట్లోకి పరుగుదీసిన మిత్రుడివంక ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు రాచిపా.

రాయసం చిన పాండురంగం, భవానీప్రసాద్‌లు చిన్ననాటి స్నేహితులు, ఇద్దరిదీ ఒకే ఊరు.

డిగ్రీ కాగానే భవానీప్రసాద్ ఐఎఫ్ ఎస్ పరీక్ష పాసయ్యాడు. పైగా వెంటనే ఉద్యోగం కూడా వచ్చేసింది. మధ్యప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖకి కేటాయించబడడంతో పై చదువుకి స్వస్తి చెప్పక తప్పలేదతనికి.

పాండురంగం మాత్రం తన చదువుని కొనసాగించాడు. తనకెంతో ఇష్టమైన ఆర్కియాలజీ సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీతోపాటుగా రీసెర్చ్‌ని కూడా ముగించి డాక్టరేట్‌ని సంపాదించుకున్నాడు.

మిత్రులిద్దరూ విడిపోయినా కూడా వారి మధ్య అనుబంధం మాత్రం తెగిపోలేదు.

వృత్తిపరంగా రాతిచిప్పలు, పాత్రల్నీ శోధిస్తుంటాడని మిత్రుడి పేరులోని ముందు మూడక్షరాలని (రా) రాయసం (చి) చిన (పా) పాండురంగం.. రాచిపా అంటే రాతిచిప్ప అనే అర్థం వచ్చేలా ఉడికిస్తూ ఉంటాడు భవానీప్రసాద్.

అది వింటూనే తేలుకుట్టిన దొంగలా మౌనంగా ఉండిపోతాడు ప్రొఫెసర్ రాచిపా.

యూనివర్శిటీ స్టూడెంట్స్ కూడా తనకా నిక్ నేమ్ ఖాయం చేసారన్న విషయం కాస్తా భవానీప్రసాద్‌కి ఎక్కడ తెలిసిపోతుందోనంటూ భయపడిపోతుంటాడతను.

ప్రొఫెసర్ రాచిపా గత మూడేళ్ళుగా బుందేల్ ఖండ్‌ని పాలించిన రాజవంశాల చరిత్రని పరిశోధిస్తున్నాడు.

మధ్యప్రదేశ్ రాష్ట్ర టూరిజం శాఖ ఈ విషయంలో అతని సహకారాన్ని కోరింది.

అటు ఉద్యోగమూ, ఇటు పరిశోధనా రెండింటికీ పొత్తు కుదరక చాలాకాలంవరకూ వారి కోరికలని అమల్లోకి తేలేదతను.

కానీ ఈమధ్య కాలంలో చందేరీ, ఓర్ఛ ప్రాంతాలు ప్రవీణ వర్మ పుణ్యమా అంటూ బాగా వెలుగులోకి రావడంతో ఆ ప్రాంతాల విశేషాలు గల బ్రోచర్స్‌ని వెంటనే సిద్ధం చేయించాలనే నిర్ణయాన్ని తీసుకుంది మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం.

దాంతో ప్రొఫెసర్ రాచిపా రంగంలోకి దిగక తప్పలేదు. ఈ మధ్యలో గతనాలుగు మాసాలుగా చందేరీ, ఓర్ఛా, బెంగుళూరుల మధ్య తిరుగుతుండటంతోనే అతనికి సరిపోతోంది.

తనూ, తన టీమూ కలిసి చందేరీ, ఓర్ఛా, ఝాన్సి మొదలగు ప్రాంతాల అధ్యయనాన్ని చాలావరకు పూర్తిచేశారు. కానీ ఆ సందర్భంగా ఓర్ఛాలో తిరుగుతున్నప్పుడు స్థానిక ప్రజల ద్వారా భవానీప్రసాద్, అన్నపూర్ణలు, బుందేల్ బావి మొదలగు విషయాలు కూడా వెలుగులోకి రావడంతో ఆ విషయాలేమిటో తెలుసుకోవడం కోసం భవానీప్రసాద్ దగ్గరికి రోజు రావాల్సి వచ్చింది.

పదినిముషాల తరువాత వంట ఇంట్లోంచి తిరిగి వచ్చిన భవానీ ప్రసాద్ ముఖం మరింతగా పాలిపోయి ఉంది.

''నువ్వు చెప్పింది నిజమేరా రాచిపా! అమ్మాయి ఐశ్వర్యా, రూపా కలసి చందేరీకి వెళ్ళారట. 'మిస్ చందేరీ ఇండియా' పోటీలో పాల్గొనడం కోసం ఆ సంస్థ పంపిన ఎయిర్ టిక్కెట్స్ ఈ ఆడపిల్లలకి అందాయట.

నేనిక్కడ్నుంచి వాళ్ళని పంపించనని తెలుసుకుని మా ఆయా, ఆ పిల్లలిద్దరూ కలిసి నన్ను బాగా ఫూల్‌ని చేశారు. ఐశ్వర్యని ఆ ప్రాంతానికి పంపడం నాకెంత మాత్రం ఇష్టంలేదు. ఇప్పుడేం జరగనుందో ఏమో?'' అంటూన్న భవానీప్రసాద్ గొంతు కాస్తా బొంగురుపోయింది.

వంట ఇంట్లో ఓ పదినిమిషాలు తనని తల్లక్రిందులుగా చేసి చివరికి ఐశ్వర్యా, రూపమతి లిద్దరూ చందేరీకి వెళ్ళారన్న విషయాన్ని రాబట్టుకుని వెళ్ళిన భవానీప్రసాద్ ఇక ముందు ఏంచేస్తాడోనన్న భయంతో కృంగిపోయింది హైమవతి.

భవానీప్రసాద్ గొంతులో ధ్వనిస్తున్న భయాందోళనలకు గల కారణము ఏమిటో అర్థంకాక ఇబ్బందిగా కదిలాడు ప్రొఫెసర్ రాచిపా.

''నీవంతగా బాధపడడంలో నాకర్థమేమీ కనిపించడంలేదు ప్రసాద్'' లోగొంతుతో అన్నాడతను.

అది వింటూనే మిత్రుడివంక కోపంగా చూశాడు భవానీప్రసాద్. నా ప్రాణానికి ప్రాణంగా మసిలిన నా భార్య అన్నపూర్ణ అక్కడే అన్యాయంగా మసైపోయింది. పచ్చగా నూరేళ్ళు బ్రతకాల్సిన ఆమె వెచ్చని చితాభస్మాన్ని ఈ పాడు చేతులతోనే బేత్వానదిలో కలిపేశాను'' అంటూ కన్నీరు ముంచుకురాగా తన అరచేతుల్ని ముందుకు సాచి ప్రొఫెసర్ రాచిపాకు చూపాడు భవానీప్రసాద్.

''జరిగిపోయినదానికి, ఇప్పుడూ ఐశ్వర్య అక్కడికి వెళ్ళడానికి ముడిపెట్టి బాధపడాల్సిన అవసరం నాకు కనిపించడంలేదు ప్రసాద్. నీ కూతురు రేపటి భారతసుందరి అని ఊహించుకుని సంతోషపడేందుకు ప్రయత్నించు'' అన్న ప్రొఫెసర్ రాచిపా వంక అసహనంగా చూశాడు భవానీప్రసాద్.

''రాచిపా! విషయం తెలీకుండా నీవలా తేలిగ్గా మాట్లాడటం నేను సహించను. అర్థహీనంగా భయ పడిపోతున్నానని నన్నలా చులకనగా చూడవద్దు. గత పదేళ్ళు నా గుండెల్లో గూడు కట్టుకుని ఉన్న ఆ అగ్నిని నేనేదో రోజు చల్లార్చక తప్పదు. అందుకిప్పుడు రంగం సిద్ధమయినట్టుంది. నేనీ నిజాన్ని ఎవరికో ఒకరికి తెలియజేయక తప్పేట్టులేదు'' అంటూ ఆగిపోయాడు భవానీప్రసాద్.

వారిద్దరి మధ్యా ఓ ఐదు నిమిషాలు కాలం నిశ్శబ్దంగా రాజ్యమేలడాన్ని వంట ఇంట్లో నుంచి గమనిస్తూనే ఉంది హైమవతి.

ఆ తర్వాత మాట్లాడటం ప్రారంభించాడు భవానీప్రసాద్.

''రాచిపా! దివ్యశక్తులూ, దుష్టశక్తులూ వాటి ప్రభావం గురించి నేను అధికంగా మాట్లాడదలచుకోలేదు కానీ కొన్ని విచిత్ర సంఘటనలని నా జీవితం ఎదుర్కొందన్న విషయాన్ని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను.

అయితే అలాంటి శక్తుల ప్రభావం మనుషులపైనా, వారు నివసించే పరిసరాలపైనా ఎంతవరకు పడగలుగుతుందోనన్న విషయాన్ని మాత్రం నీవంటి చరిత్రకారులే తెలియజేయాల్సి ఉంటుంది. అందుకే నీకీ రహస్యాన్ని చెప్పడానికి సాహసిస్తున్నాను" అన్నాడు భవానీప్రసాద్.

అది వింటూనే ప్రొఫెసర్ రాచిపా తన చెవుల్ని రిక్కించాడు.

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments